నమస్తే తెలంగాణ

# నిర్మల్

5 | నిజామాబాద్, సోమవారం 26 ఫిబ్రవరి 2024 | NIRMAL


## ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



రవిదాస్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : సంత్ రవిదాస్ 647వ జయంతి వేడుకలను ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మీనగర్ సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని రవిదాస్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రామన్న మాట్లాడుతూ.. రవిదాస్ సేవలను గుర్తు చేశారు. ఆధ్యాత్మికతతోపాటు సమాజ ఔన్నత్యానికి ఆయన చూపించిన మార్గం మరువలేనిదన్నారు. అంతకుముందు సంఘం సభ్యులు జోగు రామన్నను శాలువాతో సత్కరించారు.

## బీజేపీది సవతి తల్లి ప్రేమ

- రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ దేవేందర్
- 40వ రోజుకు చేరుకున్న దీక్షలు



నిరసన తెలుపుతున్న సాధన కమిటీ సభ్యులు

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : ఆదిలాబాద్ జిల్లాపై మొదటి నుంచి బీజేపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నదని, రైల్వే లైన్ మంజూరు చేసి పనులను ప్రారంభించాలని సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఆర్అండ్బీ అతిథి గృహం ఎదుట రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 41వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్నంగా ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, అప్సర్ఖాన్, సభ్యులు భాస్కర్, గేడం కేశవ్, నాగేందర్, నితీశ్ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రైతుబంధు సాయమేదీ.. రుణమాఫీ వట్టిమాటేనా..

**కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైంది..**

- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను కాల్చి చంపుతున్నది..
- రైతులను ఆదుకోవడంతో రెండు పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయి..
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆగ్రహం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ) : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోనియాగాంధీ పుట్టిన రోజు కానుకగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్రెడ్డి తన హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పంపిణీ డిసెంబరు 11న ప్రారంభించిందని, రెండున్నర నెలలు గడుస్తున్నా రైతులకు డబ్బులు అందడం లేదన్నారు. కుటుంబంలో ఒక్కరికే రైతుబంధు పంపిణీ చేస్తారా? కౌలు రైతులకు సాయం అందుతుందా? లేదా? అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

### కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి..

కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో కాంటాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిందని తెలిపారు. జిల్లాలో సోయాబిన్ సీజన్ ముగిసి ఐదు నెలలు దాటిందని రైతులు ఇప్పటికే 75 శాతం పంటలను ప్రైవేటు వ్యాపారులకు అమ్మేశారన్నారు. పంటను విక్రయించిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సోయా కేంద్రాలను ప్రారంభించడం హాస్యాస్పదమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం ఇలాంటి పనులు చేయవద్దని సూచించారు. జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో శనగ పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోతే ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీలో రైతులు సమస్యల కోసం ఆందోళన చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతులను మోసం చేస్తున్నాయని, ఎన్నికల కోడ్ కంటే ముందే కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, కౌలు రైతులు సాయం విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జిగిరి నారాయణ, శ్రీనివాస్, ప్రకాశ్, దయానంద్ పాల్గొన్నారు.

# భగీరథ ప్రయత్నం

**యాసంగి పంటలను కాపాడుకునేందుకు రైతుల కష్టాలు**

- అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు..
- నూతన బావుల తవ్వకం, పూడికతీత పనుల్లో అన్నదాతలు
- తెలంగాణ ఏర్పడక ముందు పరిస్థితులు పునరావృతం






వ్యవసాయ బావుల్లో జేసీబీతో పూడిక తీసిస్తున్న రైతులు

*రైతన్నలు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి నూతన బావుల తవ్వకం, పూడికతీత పనుల్లో నిమగ్నం అయ్యారు. మొత్తంగా తెలంగాణ రాకముందు పరిస్థితులు ఎలా ఉండెనో.. ఇప్పుడు కూడా పరిస్థితులు అలానే కనిపిస్తున్నాయి. పంటలను కాపాడుకోవడానికి దస్తురాబాద్ మండలంలో నూతనంగా పది బావుల తవ్వకం, 300 వరకు వ్యవసాయ బావుల్లో పూడిక తీయిస్తున్నారు.*

దస్తురాబాద్, ఫిబ్రవరి 25 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని దస్తురాబాద్ మండలంలో పంటలు వట్టిపోతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవక పోవడం, కడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల లేకపోవడంతో సాగుకు నీరందే పరిస్థితి లేదు. దీనికితోడు భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. మండల కేంద్రంతోపాటు పెర్కపల్లె, ఎర్రగుంట, మున్యాల, గొడిసేర్యాల, రేవోజిపేట, మల్లాపూర్, గొండుగూడెం, బుట్టాపూర్, ఆకొండపేట గ్రామాల్లో గత యాసంగిలో 8,900 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఈ యేడాది నీటి లభ్యత లేకపోవడంతో 5,900 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.దాదాపు 3 వేలకుపైగా భూములు బీడుగా మారాయి. పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు నూతనంగా తొమ్మిది బావులను తవ్విస్తున్నారు. దాదాపు 300లకుపైగా రైతులు తమకున్న బావుల్లోనే పూడిక తీయిస్తున్నారు. ఇలా జేసీబీ సహాయంతో అయితే గంటకు రూ.2,600, లాంగ్ లెంత్ జేసీబీ అయితే గంటకు రూ.4,600 తీసుకుంటున్నారు. ఇలా ఒక బావి తవ్వడానికి, నూతనంగా మోటర్కు దాదాపు రూ.50 వేలకుపైగా తక్కువలో తక్కువ అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఇగ, పూడికకు కూడా వేలల్లో డబ్బులు అవుతున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పంటలను కాపాడుకోవడం కష్టమేనని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ సర్కారు ముందు చూపు లేని కారణంగా పంటలు వట్టిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### పూడికతీతకు రూ.9వేలకుపైగా అయ్యాయి..

నా పేరు గోనె శంకరయ్య. మాది దస్తురాబాద్ మండలంలోని మున్యాల గ్రామం. నాకు 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ యాసంగిలో వరి వేశా. నాట్లు కూడా అయిపోయాయి. ప్రతి యేటా మాదిరిగానే నీటి వసతి ఉంటుందనుకున్నా. కానీ.. కడెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కావడం లేదని ఈ మధ్యే తెలిసింది. ఒక వైపు పంటలు ఎండిపోవడం తట్టుకోలేక పోయా. పెట్టుబడి కూడా పెట్టా. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలని నా వ్యవసాయ బావిలో రూ.9వేలు పెట్టి పూడిక తీయించా. గత పదేండ్లలో ఎప్పుడు కూడా పూడిక తీయించలేదు. ఇదే మొదటిసారి. పైసలు కూడా బాగా ఖర్చయ్యాయి. కాంగ్రెసోళ్ల ముందు చూపు లేని కారణంగా ఈ పరిస్థితి దాపురించింది. అధికారంలోకి రావడంతోనే కడెంపై దృష్టి పెడితే ఈ పరిస్థితి ఉండకపోతుండే. పంటలు ఎండిపోక పోతుండే.



జేసీబీ సహాయంతో కొత్తగా బావి తవ్విస్తున్న రైతులు



కడెం ప్రాజెక్టు వద్ద పనులను పరిశీలిస్తున్న ఈఎన్సీ బృందం సభ్యులు

## ఈఎన్సీ కడెం సందర్శన

- కొనసాగుతున్న ఆప్రాన్, స్పిల్వే పనులు
- నేడు హైదరాబాద్లో సమీక్ష

కడెం, ఫిబ్రవరి 25 : కడెం ప్రాజెక్టును ఆదివారం ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ) బృందం సభ్యులు పరిశీలించారు. రెండేళ్లుగా జూలైలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని ఈఎన్సీ అనిల్ కుమార్ పరిశీలించడంతోపాటు, చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా గేట్ల మరమ్మతు, తెగిపోయిన రోప్స్, రూలర్స్, పడిపోయిన కౌంటర్ వెయిట్లు, మోటర్ గదులకు వచ్చిన పగుళ్లకు మరమ్మతులు చేయడం దానితోపాటు, ప్రధాన కాలువ ప్రాంతంలో పడిన గొయ్యికి దానికి చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలని, అలాగే స్కాడా ఆధ్వర్యంలో వరదగేట్లను పరిశీలించే గదిని, సీసీ కెమెరాలు, జనరేటర్లు, వరదలను కొలిచే పరికరాలను ఈఎన్సీ అధికారులు పరిశీలించారు. వరదగేట్ల దిగువన దెబ్బతిన్న ఆప్రాన్, స్పిల్వేలకు చేపడుతున్న మరమ్మతులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రాజెక్టు పరిస్థితిపై ఈ నెల 26వ తేదీన హైదరాబాద్లో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సునీల్కుమార్, ఈఈ విఠల్, డీఈ బోజదాస్ పాల్గొన్నారు.



మల్లన్న స్వామి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

## కనుల పండువగా రథోత్సవం

సోన్, ఫిబ్రవరి 25 : నిర్మల్ మండలంలోని ముజ్గి మల్లన్న జాతరలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం నిర్వహించిన రథోత్సవం వైభవంగా కొనసాగింది. మల్లన్నస్వామికి సంప్రదాయ పద్ధతిలో భక్తులు రథోత్సవాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అంతకుముందు భక్తులు మల్లన్నస్వామి, నాగదేవతలకు మొక్కులు సమర్పించుకుని తులాభారం వేయించుకున్నారు. బెల్లాన్ని స్వామివారికి ప్రసాదంగా పంచిపెట్టారు. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, కరుణసాగర్, రవీందర్, సుమాంజలి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. 50 వేల వరకు భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## సొరంగ మార్గం పనులు వేగవంతం

దిలావర్పూర్, ఫిబ్రవరి 25 : దిలావర్పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామ శివారులో గల శ్రీరాంసాగర్ బ్యాక్వాటర్ ఆధారంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్యాకేజీ-27 పనులకు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సొరంగ మార్గం పనులను కూడా చేపడుతున్నారు. ఎండాకాలం కావడంతో పనులను త్వరగా చేస్తున్నారు. మైదాన ప్రాంతం నుంచి గుట్ట మీది గ్రామాలకు నాలుగు కిలోమీటర్ల మేర టన్నెల్ గుండా సాగు నీరు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.



ప్యాకేజీ 27 సొరంగ మార్గం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారిణి స్వర్ణలత

## ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

**హాజరైన 301 మంది విద్యార్థులు..**

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ(టీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్) కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆదివారం నిర్వహించిన రెండో దశ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని బోథ్ కళాశాల ప్రిన్సిపల్, ప్రత్యేక అధికారిణి స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. మొదటిసారి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికే రెండో దశలో ప్రవేశ పరీక్ష నిర్వహించామని తెలిపారు. 318 మంది విద్యార్థులు రెండో దశ పరీక్ష కోసం ఎంపిక కాగా.. 301 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. బాలురు 173, బాలికలు 145 మంది ఉన్నారని తెలిపారు. రెండో దశ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట డీసీవో, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఉన్నారు.

## హీరాసుక జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. హీరాసుక జాగృతి ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బస్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించిన హీరాసుక జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హీరాసుక జాగృతి నాయకులు సిడాం రాంకిషన్, మెస్రం కృష్ణ, గెడం జనార్దన్, మనోహర్, ప్రదీప్, సుభాష్ జాదవ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

### మహనీయులు చూపిన మార్గంలో నడవాలి..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 : మహనీయులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యేపాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్లో నిర్వహించిన శ్రీ సంత్ రవిదాస్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రవిదాస్ చిత్రంతోపాటు మహనీయుల చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలి..

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : రిమ్స్లో పనిచేస్తున్న కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. రిమ్స్ దవాఖాన ఎదుట చేపట్టిన నిరసన ధర్నా ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిమ్స్, సూపర్ స్పెషాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, సెక్యూరిటీ గార్డ్, జీవో ఎంఎస్ 60 ప్రకారం ప్రతి కార్మికుడికి వేతనాలు ఇవ్వాలన్నారు. వేతనలు ఇవ్వకపోతే వచ్చే నెల 7వ తేదీ నుంచి కార్మికులందరు విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంఘం బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఖాసీం, అధ్యక్షురాలు సంగీత, కార్మికులు ఇమ్రాన్ఖాన్, రాము, రవీందర్ రాథోడ్, రవి, గంగు, సునీత, రాజేందర్ సింగ్, శివకేశ్, స్వామి వెంకటేశ్, దత్తు, నర్సింగ్ పాల్గొన్నారు.




రిమ్స్ ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు